

ఎవరూ రాకముందే జెండా ఆవిష్కరణ
● అధికారులు, నాయకులు లేకుండానే ఎగురవేసిన జడ్పీ సీఈవో 7

రేపు జిల్లా అథ్లెటిక్స్
జట్ల ఎంపికలు
● ఎంపికైన వారికి పీయూలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం 6

జల సవ్వడి

అలుగు పారిన బండరపల్లి చెక్ డ్యాం

ప్రయాణికులకు కనువిందు..

చూసేందుకు తరలొస్తున్న ప్రజలు

చిన్నచింతకుంట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెక్ డ్యాములు నీటితో కళకళలాడుతున్నాయి. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో గురువారం ఐదు, శుక్రవారం ఒక గేటు ద్వారా నీటిని బయటికి వదిలారు. వరద నీరు రావడంతో చిన్నచింతకుంట మండలం బండరపల్లి గ్రామ సమీపంలోని చెక్ డ్యాం అలుగు పారుతోంది. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులకు కనువిందు చేస్తోంది. చెక్‌డ్యాం అలుగు పారడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి, తిలకిస్తున్నారు.



అలుగు పారుతున్న చెక్ డ్యాం

కోయిల్‌సాగర్ నాలుగు గేట్ల మూసివేత

దేవరకద్ర, అగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు కోయిల్‌సాగర్ ఒక గేటు ద్వారా అధికారులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. గురువారం 5 గేట్లను ఎత్తిన అధికారులు, పై నుంచి నీరు తగ్గడంతో శుక్రవారం ఉదయం 4 గేట్లను మూసివేశారు. మొత్తం 13 షెటర్లు ఉండగా, ఏడో నంబర్ షెటర్ ద్వారా నీటిని వదులుతున్నట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. 250 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ప్రస్తుతం 31.5 అడుగుల వద్ద నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో బోర్లల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయకట్టుదారులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోయిల్‌సాగర్ ఒక గేటు ద్వారా విడుదలవుతున్న నీరు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రైతు రుణమాఫీతో కొత్త చరిత్ర

● గతపాలకుల పాపాలు.. శాపాలై వెంటాడుతున్నాయ్!

● ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

● మత్తు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● విద్యారంగంలో ప్రగతి.. రైతులకు భరోసా

● పంద్రాగస్టు వేడుకల్లో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



జాతీయ జెండాను ఎగురవేసి, వందనం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు(చిత్రంలో ఎడమ నుంచి) కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలించిన గత పాలకుల పాపాలు శాపాలుగా వెంటాడుతున్నా, ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించక పోయినా వాటన్నింటిని అధిగమిస్తూ రైతుల విషయంలో రాజీ పడలేదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర రాశామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మంత్రి ప్రసంగించారు. ప్రజాపాలనలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు.

చెడుమార్గాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలు, మత్తుకు బానిసలు కాకుండా మంచి వైపు పయనించాలని మంత్రి జూపల్లి కోరారు. విద్యతోనే జీవితాలు బాగుపడతాన్న విషయాన్ని గర్తించాలన్నారు. బాల్యం సెల్‌ఫోన్‌లకు బంధీ కావొద్దని సూచించారు. శారీరక వ్యాయామం ప్రతీ ఒక్కరికి ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా పిల్లలకు వ్యాయామం, సంస్కృతిని నేర్పించాలన్నారు. తన నిధులు రూ.2 కోట్లతో ప్రతీ గ్రామంలో రూ.2 లక్షలతో లైబ్రరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

11,035 ఇందిరమ్మ ఇళ్లు

పాలమూరు జిల్లాకు మొదటి విడతలో 11,035 ఇళ్లు మంజూరు అయ్యాయని మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 6,568 ఇళ్ల పనులు ప్రారంభం అయ్యాయన్నారు. ఇప్పటివరకు 1,502 ఇళ్లకు రూ.17 కోట్ల నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు.

విద్యాపరంగా పురోగతి

విద్యాపరంగా జిల్లా ఎంతో పురోగతిని సాధించిందన్నారు. రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీ, ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు నవోదయ విద్యాలయం, పాలమూరు యూనివర్సిటీకి లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు అయ్యాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను మెరుగుపరిచామన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రూ.37.87 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. 2025 వానాకాలంలో రైతు భరోసా కింద రూ.243 కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని గుర్తు చేశారు. జిల్లాలో 76,385 మంది రైతులకు రూ.597 కోట్ల పంట రుణాలను మాఫీ చేయడం చేశామన్నారు.

● జిల్లాలో 21,318 కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడంతోపాటు 53,925 కార్డులలో 91,040 కుటుంబ సభ్యులను చేర్చడం జరిగిందన్నారు.

● భూభారతి పోర్టల్ ద్వారా రైతులు పారదర్శకంగా, వేగవంతంగా వివరాలు తెలుసుకోవడంతోపాటు భూమి రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు ఆస్తుల బదిలీలు వంటి సేవలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 10,909 అర్జీలు స్వీకరించామని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీలకు గండం



మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 839 మంది కిడ్నీ రోగులు

● జనవరి నుంచి ఇప్పటి వరకు 154 మంది నమోదు

● రోజు రోజుకు పెరుగుతున్న డయాలసిస్ బాధితులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కిడ్నీ వ్యాధి గ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 839 మందికి కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వీరంతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటుండగా, డయాలసిస్ అవసరం లేకుండా కిడ్నీలు దెబ్బతి న్న వారు మరింత మంది ఉన్నట్లు అనధికారికంగా తెలుస్తోంది. గత ఏడాది 685 మంది వ్యాధి గ్రస్తులు ఉండగా, ఈ ఏడాది 8 నెలల్లోనే 154 మంది బాధితులు పెరగడం గమనార్హం. డిసెంబరు నాటికి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

కిడ్నీలకు గండం..

శరీరంలోని మలినాలను తొలగించడం, అవసరమైన లవణాలను శరీరానికి అందించి రక్త శుద్ధి చేయడంలో కిడ్నీలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఆహారపు అలవాట్లతో పాటు షుగర్, బీపీ ఉండటం, విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్, నొప్పుల మాత్రలు వాడటం వంటి కారణాల వలన కిడ్నీలు పాడవుతున్నాయి. దీంతో వయసుతో నిమిత్తం లేకుండా డయాలసిస్ వర కు వస్తున్నారు.

20 డయాలసిస్ సెంటర్లు..

కిడ్నీ రోగులకు రక్తమార్పిడి చేసేందుకు ఉమ్మడి జిల్లాలో 20 డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9, ప్రైవేటు ఆసుపత్రుల్లో 11 సెంటర్లు ఉన్నాయి. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రిలో 2, ప్రైవేటు ఆస్పత్రుల్లో 5 ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2, ప్రైవేటు ఆస్పత్రుల్లో 2, వనపర్తిలో ప్రభుత్వ ఆస్పత్రిలో 1, నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ పరిధిలో 4, నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 1 కేంద్రం ఉంది.

ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న డయాలసిస్ రోగులు ఇలా..

జిల్లా	ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన రోగులు	ప్రైవేటులో నమోదైన వారు	మొత్తం
మహబూబ్‌నగర్	70	262	332
గద్వాల్	108	37	145
నాగర్‌కర్నూల్	174	9	183
వనపర్తి	81	0	81
నారాయణపేట	98	0	98
మొత్తం	531	308	839



అమ్మవారికి గాజులతో అలంకరణ

నాల్గో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన చేశారు.

- మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వ పాఠశాలలకు
వంట గ్యాస్ కనెక్షన్

తీరనున్న కార్మికుల కష్టాలు

● నారాయణపేట జిల్లాలో 467 పాఠశాలలు

● ప్రస్తుతం పది పాఠశాలలకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు



నారాయణపేట మండలం జాజాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో కట్టెల పొయ్యిపై భోజనం వండుతున్న కార్మికురాలు(ఫైల్)

నారాయణపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. కట్టెల పొయ్యిపై వంట చేయడం వల్ల వంట ఆలస్యం కావడంతో పాటు పొగతో వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వంట చేసేందుకు పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఏయే పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్‌ను అవసరం ఉందని విద్యాశాఖ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని, అందుకు అనుగుణంగా మంజూరు చేయనుంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 467 పాఠశాలల్లో 52,762 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. 467 వంట ఏజెన్సీలు ఉండగా 1,524 మంది కార్మికులు వంట చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం పది పాఠశాలలకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 457 పాఠశాలలకు కనెక్షన్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు డీఈవో గోవింద్‌రాజులు, మధ్యాహ్నభోజన పథకం జిల్లా ఇన్‌చార్జి యాదయ్య శెట్టి తెలిపారు.





పంచాయతీ రాజ్ శాఖ కేంద్ర డిప్యూటీ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కొనగట్టుపల్లి కార్యదర్శి శ్రీనివాస్

పంచాయతీ కార్యదర్శికి ఢిల్లీలో ప్రశంసా పత్రం

● 2023లో సామాజిక భద్రతలో కొనగట్టుపల్లికి జాతీయ పురస్కారం

● ఆ సందర్భంగా ఎర్రకోటలో జరిగిన పంద్రాగట్టు వేడుకల్లో పాల్గొనే అవకాశం

హన్వాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత నిర్వహణలో హన్వాడ మండలం కొనగట్టుపల్లికి 2023లో జాతీయ పురస్కారం వచ్చిన సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో గ్రామ కార్యదర్శి వి.శ్రీనివాస్ పాల్గొనే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ కేంద్ర డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు ప్రశంస పత్రం అందించారు. అయితే గ్రామం 2023లో సామాజిక భద్రతలో జాతీయ అవార్డుకు ఎన్నికైన సందర్భంగా అప్పట్లో రాష్ట్రపతి చేతుల మీదుగా అప్పటి సర్పంచి, కార్యదర్శి రూ.కోటి రూపాయల నజరానా అందుకున్నారు.

దళితవాడలో అక్షర వెలుగులు

● ఫలించిన డీటీఎస్ నాయకుల కృషి

● మక్తల్‌లో రెండు కొత్త ప్రభుత్వ పాఠశాలలు

● మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఏర్పాటు

● జగ్జీవన్‌రామ్, బీసీ కాలనీల్లో ప్రారంభం

7



మక్తల్ జగ్జీవన్‌రామ్ నగర్ కాలనీలోని పూరి గుడిసెల వద్ద చిన్నారులు


మహబూబ్‌నగర్‌లో వ్యవసాయ శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో విద్యుత్‌శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో గృహనిర్మాణ శాఖ శకటం


మహబూబ్‌నగర్‌లో నగరపాలక సంస్థ శకటం


ఏకో టూరిజం శకటం

స్వాతంత్ర్య సంబురం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. దేశభక్తి గీతాలు మారుమోగాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ఈ సందర్భంగా పోలీసు బలగాలు వందన సమర్పణ చేశాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన వేడుకలకు ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నారాయణపేటలో పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఢిల్లీలో అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, వనపర్తిలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

– నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న వెల్దండ కేజీబీవీ విద్యార్థినులు


మహబూబ్‌నగర్‌లో జెండాతో చిన్నారి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న జడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు


జోగుళాంబ గద్వాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు


గద్వాలలో గాంధీ విగ్రహం వద్ద చిన్నారులు


వనపర్తిలో నృత్యం చేస్తున్న చిన్నారులు


నృత్యం చేస్తున్న వెల్దండ కేజీబీవీ విద్యార్థినులు


మహబూబ్‌నగర్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నృత్యం చేస్తున్న జడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు


నారాయణపేటలో నృత్యం చేస్తున్న చిన్నారులు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నృత్యం చేస్తున్న జెడ్పీహెచ్ఎస్ తాడూరు విద్యార్థులు

గద్వాల్ అనుకొని గజ్వేల్‌కు..

- వృద్ధుడిని చేరదీసిన ఎస్ఐ రవికుమార్
- కుటుంబ సభ్యులకు అప్పగింత

గజ్వేల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : గద్వాల్ అనుకుని గజ్వేల్‌కు వెళ్లిన ఓ వృద్ధుడిని అక్కడి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ చేరదీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారికి అప్పగించారు. జోగులాంబ గద్వాల జిల్లా, ధరూరు మండలం రాయలపాడు గ్రామానికి చెందిన చిన్న నాగప్ప(70) ఆధార్‌కార్డులో మార్పు కోసం బుధవారం తన కొడుకుతో కలసి అమీర్‌పేటకు వెళ్లారు. కానీ ఒరిజినల్ ఆధార్ కార్డు మరిచిపోవడంతో, తీసుకొస్తానని చెప్పిన కుమారుడు, అతడిని కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉంచి, వెళ్లిపోయాడు. గురువారం మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్న నాగప్ప స్టేషన్ నుంచి బయటకు వచ్చి, అక్కడున్న వారిని గద్వాలకు ఎలా వెళ్లాలని అడిగాడు. కానీ వారు గజ్వేల్ అని భావించారు. జూబ్లీ బస్‌స్టేషన్‌లో గజ్వేల్ బస్సు ఎక్కించారు. గజ్వేల్ బస్టాండ్‌లో బస్సు దిగిన నాగప్పకు ఏం చేయాలో అర్థం కాలేదు. శుక్రవారం గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని క్యాసారం రోడ్డులోని చెరువు వద్ద కూర్చొని ఏడుస్తున్నాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ సంతోష్‌లు అతడిని చూశారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి భోజనం అందించారు. వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు తెలిపారు.

వారు వచ్చాక, వివరాలు తెలుసుకొని నాగప్పను వారికి అప్పగించారు. తన తండ్రిని సురక్షితంగా అప్పగించిన పోలీసులకు కొడుకు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కోటి కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణం నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్ దేశ్‌పాండే మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ కోటి కుంకుమార్చన నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని మహిళలతో పాటు, పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. ఈ పూజా కార్యక్రమాలు ఇరువెంటి శ్రావణ్ శర్మ పురోహితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

యువత ముందడుగు వేయాలి

- అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు
- శ్రమదానం చేసిన పోలీసులు
- మంత్రాలయం రహదారికి మరమ్మతులు


శ్రమదానంతో కల్వర్టు పనులు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

అయిజ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందడుగు వేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో మంత్రాలయం, ఎమ్మిగనూర్ రహదారిపై, అయిజ సమీపంలోని పోలోని వాగు మీదున్న తాత్కాలిక కల్వర్టు దెబ్బతిన్నది. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు స్పందించి తాత్కాలిక మరమ్మతు చేయించారు. శుక్రవారం ఈ కల్వర్టుపై భారీ లారీ ఇరుక్కుపోవడంతో రహదారి మరింతగా దెబ్బతినడంతో మరోమారు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ, తమ సిబ్బంది, స్థానికుల సహకారంతో శుక్రవారం శ్రమదానం చేశారు. రహదారిపై సొంత ఖర్చుతో మొర్రం వేయించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రంజిత్‌కుమార్, రవి, జగదీశ్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు
పట్టించుకోని పాలకులు

- ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్


మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్

అమరచింత, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచందర్ విమర్శించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాజన్న అధ్యక్షతన వనపర్తి జిల్లా, అమరచింతలోని మార్క్స్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ దిగుబడులకు కనీస మద్దతు ధర అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మద్దతు ధర కోసం యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. సభకు టీయూసీఐ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, నాయకులు అంజనేయులు, వాసారెడ్డి, వెంకటయ్య, మహేంద్రాచారి, ఆశన్న, భీమన్న, బాలస్వామి పాల్గొన్నారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 17న ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించనున్న జి. రాజేంద్రప్రసాద్ స్మారక 11వ రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 17న ఉదయం 9 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో కోచ్ సునీల్ కుమార్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

పొంగి పొర్లుతున్న దుందుభీ


డిండీ డ్యామ్ వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు

- కొనసాగుతున్న వరద ఉధృతి
- డిండి డ్యామ్ వద్ద పర్యాటకుల సందడి

ఉప్పునుంతల/తాడూరు/ అచ్చంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేని వర్షాలతో దుందుభీ నది పరవళ్లు తొక్కుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, నల్లగొండ సరిహద్దులోని డిండీ ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్నది. దీంతో గురువారం సమీప గ్రామాల ప్రజలతో పాటు, పర్యాటకులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద సందడి నెలకొన్నది. ఈ ప్రాజెక్టు శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో పర్యాటకుల తాకిడి అధికంగా కనిపించింది. శ్రీశైలం, మద్దిమడుగు, మల్లెలతీర్థం, ఉమామహేశ్వరం తదితర క్షేత్రాలకు వెళ్తున్న ప్రజలు ప్రాజెక్టు వద్ద ఆగి దుందుభీ పరవళ్లను తిలకిస్తున్నారు. సెల్‌ఫోన్ కెమెరాల్లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సంబురపడ్డారు. ప్రాజెక్టు నిండటంతో పంటలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు, ఉపాధి లభిస్తుందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నది వద్ద పోలీసు పహరా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా పర్యాటకుల తాకిడి అధికం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

వర్షం కొంత తెరిపినిచ్చినా, దుందుభీ నదికి వరద ఉధృతి మాత్రం కొనసాగుతూనే ఉంది. దీంతో నదీ తీర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. మేడిపూర్ వద్ద కూడా నది పరవళ్లు తొక్కుతోంది. చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిని కేసరి సముద్రం చెరువు బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తిర్మలాపూర్ గ్రామస్థులు పుట్టి సహాయంతో రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. అచ్చంపేట మండల పరిధిలోని మన్నెవారిపల్లి సమీపంలో వాగును డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, తహసీల్దార్ సైదులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నెవారిపల్లి నుంచి చందంపేటకు వెళ్ళే రహదారిపై వాగు పారు తున్నందున ఎవరూ దాటేందుకు ప్రయత్నించొద్దన్నా రు. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.


అలుగు పారుతున్న సింగోటం శ్రీవారి సముద్రం

అలుగు పారుతున్న శ్రీవారి సముద్రం

కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం సమీపంలో సురభిరాజుల కాలంలో నిర్మించిన శ్రీవారి సముద్రం నిండు నీటితో కళకళలాడుతోంది. అలుగు పారుతూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. చెరువు అందాలను తిలకించేందుకు మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు తరలివస్తున్నారు. అలుగు వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.


మేడిపూర్ గ్రామం వద్ద కల్వకుర్తి నంద్యాల జాతీయ రహదారి హైలెవల్ వంతెన కింది నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి నది


చెర్లతిర్మలాపూర్ ఉయ్యాలవాడ గ్రామాల మధ్య కేసరి సముద్రం నీళ్లు రహదారిపై మల్లుకోవడంతో పుట్టిలో వెళ్తున్న గ్రామస్థులు


మన్నెవారిపల్లి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తునన ఎమ్మెల్యే వంశీకష్ణ

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటిక్యాల ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలంలోని ఎదుట్ల గ్రామానికి చెందిన సాయిబాబా (40) 5 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. గత ఏడాది కుమార్తె పెళ్లి కోసం అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అతడు గత మంగళవారం తిరుపతికి వెళ్తున్నానని భార్య లక్ష్మికి చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కనున్న చెటుకుఉ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన నెంబర్‌కు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులు విద్యార్థి ఆత్మహత్య

వెల్దండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలైన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రానికి చెందిన కొండ్రేటి కృష్ణయ్య, భారతమ్మ దంపతుల కుమారుడు శివప్రసాద్ (18) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. అతడు కొంతకాలంటా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. అందుకోసం చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై తల్లి భారతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి



పశువుల షెడ్‌లో మృతి చెందిన ఆవులు

రాజాపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో గురువారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో నాలుగు ఆవులు మృతి చెందాయి. రాజాపూర్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలం తిరుమలగిరి తండాకు చెందిన రైతు అయిన జర్పుల హన్మంతు గురువారం సాయంత్రం ఆవులను షెడ్‌లో ఉంచి మేత వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 4 గంటలకు షెడ్ దగ్గరకు వచ్చి చూడగా, నాలుగు ఆవులు చనిపోయి కనిపించాయి. రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు తెగి షెడ్డుపై పడటంతో అవి విద్యుదాఘాతానికి గురై చనిపోయినట్లు గుర్తించాడు. వాటి విలువ రూ. 4.80 లక్షలు ఉంటుందని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్తి నష్టం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైన వస్తు సామగ్రితో బాధితుడు బార్కి రామలింగన్న

అయిజ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన బార్కి రామలింగన్న ఇంటి వెనుకనున్న చిన్న గోదాంలో బియ్యం, పంపులు, ఇతర నిత్యావసర సరుకులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను నిల్వ ఉంచాడు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గోదాంలో మంటలు చెలరేగి, అన్ని వస్తువులూ కాలిబూడిదయ్యాయి. దీంతో తమకు దాదాపు రూ. 4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న ఆర్ఐ భరత్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

కృష్ణంపల్లి చెరువు కట్టకు గండి

- గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య
- అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు



గుర్తు తెలియని వ్యక్తులు చెరువుకు గండి కొట్టడంతో వృథాగా పారుతున్న సాగునీరు

అమరచింత, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మండల పరిధిలోని కృష్ణంపల్లి చెరువు (రాంరెడ్డి కుంట) కట్టను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కట్టకు గండి కొట్టడంతో సాగునీరు వృథాగా అవుతోంది. గ్రామస్థులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వే నెంబర్ 16, 17ల లో రాంరెడ్డి కుంట చెరువు కట్టకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని గడ్డపారలతో పెద్ద రంధ్రం చేశారు. దీంతో చెరువులోని నీరంతా వృథా అవుతోంది. చుట్టుపక్కల రైతులు గమనంచి నీటి పారుదల అధికారులు, తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు గ్రామానికి చేరుకొని చెరువుకట్టను పరిశీలించారు. ఘటనపై రైతుల ఫిర్యాదు మేరకు డీఈ, ఏఈలు పంచనామా చేసి, తహసీల్దార్‌కు, అమరచింత పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే చెరువుకు గండి కొట్టారని, గతంలోనూ అందుకు ప్రయత్నించారని రైతులు తెలిపారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

వర్షాలకు కూలిన ఇల్లు



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న సెక్రటరీ రజియాబేగం

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరులో మట్టి ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన వడ్ల జయలక్ష్మి, శేరువయ్య దంపతులు తమ కుమారుడితో కలిసి తమ పూర్వీకులు కట్టించిన మట్టి ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గురువారం రాత్రి ఆ ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పిందని మాజీ సర్పంచి శ్రీలత తెలిపారు. సమాచారం అందుకున్న కార్యదర్శి రజియా బేగం, ఆర్ఐ నాగరాజులు కూలిన ఇంటిని పరిశీలించారు.

దళితవాడలో అక్షర వెలుగులు

- ఫలించిన డీటీఎఫ్ నాయకుల కృషి
- మక్తల్‌లో రెండు కొత్త ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు
- మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఏర్పాటు
- జగ్జీవన్‌రామ్, బీసీ కాలనీల్లో ప్రారంభం



జగ్జీవన్‌రామ్ కాలనీలో పాఠశాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి (ఫైల్)



చిన్నారులు, మహిళతో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు హైమావతి (ఫైల్)

నారాయణపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : దళిత విద్యార్థుల జీవితాల్లో అక్షర వెలుగులు విరబూశాయి. మక్తల్ పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ కాలనీ, బీసీ కాలనీలో కొత్తగా రెండు ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. ఆయా కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) గుర్తించింది. సంఘం నాయకులు హైమావతి, సూర్యచంద్రలు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వాకిటి శ్రీహరితో పాటు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, గత, ప్రస్తుత కలెక్టర్లు కోయ శ్రీహర్ష, సిక్తా పట్నాయక్, డీఈవో గోవిందరాజులు, మక్తల్ ఎంఈవోలు వెంకటయ్య, అనిల్‌గౌడ్‌కు వినతిపత్రాలు ఇచ్చి సమస్యను వివరించారు.

పూరి గుడిసెల్లో నివసించే నిరుపేద చిన్నారులకు ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యను అందు బాటులోకి తీసుకురావాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో మక్తల్‌కు రెండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. బాబూ జజ్జీవన్‌రామ్ కాలనీ, బీసీ కాలనీలల్లో జూలై 29న రెండు ప్రభుత్వ పాఠశాలలను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు.

ఒకటి అద్దె, మరొకటి ప్రభుత్వ భవనం

మక్తల్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలోని పాల శీతలీకరణ భవనంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒకటవ తరగతిలో 25 మంది విద్యార్థులు చేరి, విద్యాభ్యాసం చేస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయురాలు నందిత విద్యాబోధన చేస్తున్నారు. బీసీ కాలనీలోని ఓ అద్దె భవనంలో ప్రారంభించిన ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 35 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆ కాలనీలకు చెందిన మరో వంద మంది విద్యార్థులు దూరంగా ఉన్న చాకలిగేరి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు కూడా ఈ కొత్త పాఠశాలల్లో చదువుకునేలా 5 తరగతులను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

2015 నుంచే ప్రయత్నాలు

జగ్జీవన్‌రామ్ కాలనీ, బీసీ కాలనీల్లో ఎస్సీ ఉపకులాలైన సంచార బుడగజంగం, వీర ముష్టి, దళితులు నివసిస్తున్నారు. అందుబాటులో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో వారి పిల్లలు చదువకుఉ దూరం అవుతున్నారు. ఆర్థిక స్థోమత లేని కాలనీవాసులు గతంలో కొందరు బాలికలకు గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేశారు. మరికొందరు భిక్షాటనకు వెళ్లేవారు. డీటీఎఫ్ ప్రస్తుత జిల్లా అధ్యక్షురాలు హైమావతి బదిలీపై చాకలిగేరి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు.

గ్రామ చివరన పూరి గుడిసెల్లో నివసించే పేద కుటుంబాల పిల్లలు చదువకు దూరం అవు తున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. దీంతో ఆ మె వారి తల్లిదండ్రులను కలిసి పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించారు. 2015లో మూడు కిలోమీటర్ల దూరంలోని తమ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అయితే వారు కాలినడకన వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగాయి. దీంతో 2017-2018లో విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. కొంతకాలం తానే సొంతంగా ఆటో చార్జీలను చెల్లించారు. ఆ తర్వాత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, విద్యార్థులు బడికి వచ్చేందుకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఫలించిన 10 ఏళ్ల ప్రయత్నం



నిరుపేద పిల్లలు చదువుకు దూరం కాకూడదని నేను 10 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం నేటికి ఫలించింది. చాకలిగేరి ప్రభుత్వ పాఠశాలలో 2015-16లో 19 మంది విద్యార్థులు ఉండేవారు. జగ్జీవన్‌రామ్, బీసీ కాలనీల్లో తల్లిదండ్రులను కలిసి, వారి పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించడంతో విద్యార్థుల సంఖ్య 84కు పెరిగింది. కానీ పాఠశాల దూరం కావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. అందరికీ విద్యను అందించాలన్న స్ఫూర్తితో పని చేసిన పూలే దంపతులు, అంబేడ్కర్ నాకు ఆదర్శం.

- డీజీ హైమావతి, డీటీఎఫ్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలు

ఏడాదికే మూత పడిన పాఠశాల

కరోనా వ్యాప్తి సమయంలో ఉపాధ్యాయురాలు హైమావతి స్వయంగా పేదల గుడిసెల వద్దకే వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారికి ఆధార్ కార్డుతో పాటు, జనన, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఇప్పించారు. బ్యాంకు ఖాతాలు తెరిపించారు. సమస్యను అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన 2022-23 విద్యా సంవత్సరంలో బీసీ కాలనీలో తాత్కాలికంగా పాఠశాలను ఏర్పాటు చేయించారు. ఒక వలంటీర్‌ను నియమించి, 154 మంది విద్యార్థులతో కొనసాగించారు. ఆయన బదిలీ అవడం, ఆ తర్వాత వేసవి సెలవులు రావడంతో ఆ పాఠశాల మూతపడింది. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ కాలనీల్లో పాఠశాల ఏర్పాటు అవసరాన్ని సంఘం నాయకులు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో రెండు ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి.

తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు జాతీయ పార్టీల కబంధ హస్తాల నుంచి తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చినది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును తప్పుపట్టిన కుహనా మేధావి వర్గం భారీ వ్యయంతో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నిర్మిస్తున్న బనకచర్లను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, గోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసుకొని లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. 10 సంవత్సరాల పాలనలో సాగు, తాగునీరు, విద్య వైద్య రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపినట్లు చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు అందించి రైతులను రాజులుగా మలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకున్నదని, రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో మునిసిపల్ కార్మికులకు అవమానం

- కార్యాలయం ముందు ఆందోళన



మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 15 : (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర దిన వేడుకల్లో తమకు అవమానం జరిగిందంటూ మునిసిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మునిసిపల్ కార్యాలయం ముందు శుక్రవారం ఉదయం 8.00 గంటలకు కమిషనర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అప్పటి వరకు వార్డుల్లో పారిశుద్య పనులు చేసిన కార్మికులు 8.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. వారు కార్యాలయం లోనికి వెళ్తుండగా, వార్డు అధికారి గణేష్ అడ్డుకున్నారు. బయటనే ఉండండి, మిఠాయిలు తెచ్చి ఇస్తానని చెప్పాడు. దీంతో కార్మికులు కార్యాలయం ముందు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ మురళి, ఎస్ఐ విజయ్ భాస్కర్ వారితో మాట్లాడి విషయం తెలుసుకొని, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్మికులందరూ పారిశుద్య పనుల్లో ఉంటారన్న ఉద్దేశంతో వేడుకలకు పిలువలేదని, తప్పుగా భావించొద్దని కోరారు. తమను కార్యాలయంలోకి రానివ్వలేదని కార్మికులు చెప్పడంతో, ఈ విషయంపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎవరూ రాకముందే జెండా ఆవిష్కరణ

మరికల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఇతర అధికారులు, నాయకులు రాకముందే జడ్పీ సీఈవో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో జరిగింది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాల్సి ఉంది. కానీ జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్ మండల కాంప్లెక్స్ భవనం ముందు ఉదయం 7:30 గంటలకే జాతీయ పతాకాన్ని ఎగురవేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత తహసీల్దార్ రాంకోటి, ఎంపీడీవో కొండన్న ఇతర అధికారులు, నాయకులు అక్కడికి చేరుకున్నారు.

అప్పటికే జెండా ఆవిష్కరణ పూర్తి కావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నారాయణపేటలో మంత్రి వాకిటి శ్రీహరి కార్యక్రమానికి వెళ్తున్నట్లు సీఈవో చెప్పారని సిబ్బంది తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్



కానుకుర్తి దీక్షలో రైతులకు సంఘీభావం తెలుపుతున్న రాజ్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట/ దామరగిద్ద, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : నిర్వాసితులు, రైతులకు న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా కార్యదర్శి గోపాల్ స్పష్టం చేశారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులు, రైతులు జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గోపాల్ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. అంతకుముందు దీక్షా శిబిరం ముందు నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు మశ్చేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మరాజు, నాయకులు కుర్వ హనుమంత్, లక్ష్మీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, నాయకులు నరహరి, పవన్, నవీన్ పాల్గొన్నారు.

కాన్‌కుర్తిలో 9వ రోజుకు చేరిన దీక్ష

దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో నిర్వాసితులు, రైతులు చేపట్టిన రిలే నిరాహర దీక్షలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి, సభ్యులతో కలిసి దీక్షలకు మద్దతు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలన్నారు. దీక్షలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, వెంకటేశ్, శివరాజ్, వెంకటరావు, రాజప్ప పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల ఈవోగా దీప్తి



ఈవోగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన దీప్తి

అలంపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల నూతన కార్యనిర్వహణాధికారిగా ఏ దీప్తి నియమితులయ్యారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఈవోగా ఉన్న పురేందర్ కుమార్ జమ్మిచేడ్ దేవాలయానికి బదిలీ అయ్యారు.

యోగా పోటీల్లో సత్తా చాటిన ఇటిక్యాల గురుకుల విద్యార్థులు



ఇటిక్యాలలో విద్యార్థులను సత్కరిస్తున్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

ఇటిక్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని మదురైలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి యోగాపోటీల్లో ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎం. కార్తీక్ ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకోగా, కె.రాజశేఖర్ ఆరవ స్థానంలో నిలిచాడు. అలాగే విధంగా రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన జూనియర్ నేషనల్ డూ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రంజిత్‌కుమార్, భాస్కర్‌లు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ మమత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు కృష్ణ, పీడీ రవిప్రకాష్, పీఈటీ సుజాతలు సన్మానించారు.

కొండారెడ్డిపల్లి పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం



ఇంటర్‌నెట్ సేవలను ప్రారంభిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

వంగూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వగ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంటర్‌నెట్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించడంతో పాటు, ప్రపంచ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇంటర్‌నెట్ సేవలు ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామీణ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రక్రియలో ఇది ముఖ్యమైన అన్నారు. తమ పాఠశాలకు ఇంటర్‌నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీ ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


మహబూబ్‌నగర్‌లో జెండాకు వందనం చేస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి


కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా అధికారులు


బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి వందనం చేస్తున్న ఎంపీ డీకే అరుణ , నాయకులు


కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నాయకులు


జడ్చర్ల పట్టణంలో జాతీయపతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


మహబూబ్‌నగర్ స్టేడియంలో..


గండీడ్‌లో ప్రభాతభేరీ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పాలమూరు/ మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) :స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, అదపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ, స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు, పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

జిల్లా కలెక్టరేట్, క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ విజయేందిరబోయి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జోగుళాంబ జోన్ కార్యాలయం ఆవరణలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఎస్పీ జానకి జాతీయజెండాను వేర్వేరుగా ఎగురవేశారు.

ప్రెస్‌క్లబ్ ఆవరణలో అధ్యక్షుడు నరేంద్రచారి జాతీయజెండాను ఎగురవేశారు.

జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవోస్ భవనం ఎదుట జిల్లా అధ్యక్షుడు జి.రాజీవ్‌రెడ్డి, విద్యుత్ భవన్, ట్రాన్స్‌కో కార్యాలయంలో ఎస్ఈ వెంకటశివరాం, ఎస్ఈలు జెండా ఎగురవేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు జాతీయ జెండాను కార్యాలయం వద్ద ఎగురవేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు యం.నరసింహులు, మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ బెక్కరి అనిత జెండావిష్కరణ చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ యం.విష్ణువర్ధన్‌రెడ్డి జెండావిష్కరణ చేసి ప్రసంగించారు. టీజీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్.విజయకుమార్, గిరిజన భవన్‌లో గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ జెండా ఎగురవేశారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యాలయంలో..

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శిక్షణా కేంద్రంలో మహిళలకు అందిస్తున్న నైపుణ్య కోర్సుల గురించి మంత్రికి వివరించారు.

మహబూబ్‌నగర్ అర్బన్ : జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో జిల్లా క్రీడాశాఖ అధికారి ఎస్. శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఎంఐఎం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హదీ జాతీయజెండాను ఆవిష్కరించారు.

జడ్చర్ల: మునిసిపాలిటీలోని గాంధీచౌరస్తా వద్ద జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద ఎగురవేశారు. మునిసిపాలిటీలోని బాబీస్ట్రీట్‌లో, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొని జాతీయపతాకాన్ని ఎగురవేశారు.

మహమ్మదాబాద్: మండలంలో పాఠశాల, కళాశాల, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో జెండాను ఆవిష్కరించారు.

కోయిలకొండ: మండల కేంద్రంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీవో కాళప్ప, ఎస్ఐ తిరుపాజీ, ఎంఈఓ వెంకటేజీ పాల్గొన్నారు.

భూత్పూర్: మునిసిపాలిటీ కమిషనర్ నురూల్ నజీబ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కిషన్ నాయక్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు.


బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

దేవరకద్ర: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ కతలప్ప జెండాను ఎగరవేశారు. కమిషనర్ నరేష్‌బాబు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనువాస్‌రావు, ఈవో సీత్యానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాధాకృష్ణ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివానందం, వ్యవసాయ కార్యాలయలోఓ ఏవో ప్రదీప్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

బాలానగర్: తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ లెనిన్, సింగిల్‌విండో కార్యాలయం వద్ద డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి జెండాను ఎగరవేశారు.

మహబూబ్‌నగర్ టౌన్: ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ఆర్ఎం సంతోష్‌కుమార్, డిపో వద్ద డీఎం సుజాత, స్థానిక పుట్నాల బట్టి వద్ద మోచి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద కార్యనిర్వాహణ అధికారి వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మిడ్జిల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, యువజన సంఘాలు, కులసంఘాలు, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయజెండాలను ఎగురవేశారు.

గండీడ్: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంపై మండల ప్రత్యేక అధికారి సంజీవ్ కుమార్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లికార్జున్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మూసాపేట: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎమ్మార్సీ భవనంతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ జెండావిష్కరణ చేశారు.

పాలమూరు యూనివర్సిటీ: పీయూలో వీసీ జీఎన్ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళి అర్పించారు.

దేశరక్షణే ప్రధాని మోదీ లక్ష్యం: ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: దేశరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న ప్రధాని మోదీకి మనమంతా ఉండగా ఉండాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఎంపీ జెండాను ఆవిష్కరించారు.

మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం : ఎమ్మెల్యే జీఎంఆర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎందరో మహనీయుల పోరాటం, త్యాగఫలమే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని డీసీసీ అధ్యక్షుడు డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మదుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు.

అసమానతలు రూపుమాపాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అసమానతలు రూపుమాపాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని రంగాల్లో బీఆర్ఎస్ ముందుకు తీసుకెళ్లిందన్నారు.


మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ వద్ద..


కోయిలకొండ ఎమ్మార్సీలో..


భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో..

340 మంది అధికారులకు అవార్డులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్నారు. ఆయా శాఖలకు చెందిన 340 మందికి శుక్రవారం పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి


పశుసంవర్ధకశాఖ అధికారులు


ప్రశంసాపత్రం అందుకుంటున్న డీపీవో సిబ్బంది


వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది


విద్యాశాఖ సిబ్బంది


మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది


బీసీ వెల్ఫేర్ సిబ్బంది


ఆర్టీవో సిబ్బంది


ఆర్టీసీ సిబ్బంది


ఆబ్కారీ సిబ్బంది


అవార్డు అందుకుంటున్న పోలీస్‌శాఖ


న్యాయసేవా సమితి


అగ్నిమాపక సిబ్బంది

న్యూస్ బాక్స్

ఆర్టిజన్స్‌కు ఏపీ ఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయాలి

పాలమూరు,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌కు కన్వర్షన్‌తోపాటు ఏపీ ఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 మహబూబ్‌నగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈమధ్య భారీ వర్షాల్లో ఉద్యోగులతోపాటు ఆర్టిజన్స్ చేస్తున్న సేవల్లో తేడా లేదన్నారు. సేవలు, పనుల్లో తేడాలేనప్పుడు, రూల్స్ ఆర్టిజన్స్‌కు ప్రభుత్వం ఎందుకు వర్తింప చేయదని ప్రశ్నించారు. రాత్రి, పగలు వర్షాకాలంలో ఎలాంటి బ్రేక్‌డౌన్ అయినా ప్రాణాలను లెక్కచేయకుండా విద్యుత్ సరఫరా చేస్తున్న కార్మికుల శ్రమకు వెలకట్టలేనిదన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గండీడ్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ చైర్మన్ పదవి కాలం ఆరు నెలలు పొడిగించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉట్లోత్సవం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఇస్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహిస్తున్నట్లు వరదరాజు దాస్ తెలిపారు. శుక్రవారం ప్రభుజీలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉట్లోత్సవం, అభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు తమ ఉద్యమం ఆగదని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చారెడ్డి, అక్తర్ హైమద్, సరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో విలీనం చేయాలి

» జేఏసీ నాయకుల డిమాండ్

గండీడ్ , ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గండీడ్, మహమ్మదాబాద్ ఉమ్మడి మండలాలను వికారాబాద్‌లో చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవాంర ఒకే పార్లమెంట్, జిల్లా, నియోజకవర్గం ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ఉమ్మడి మండల జేఏసీ నాయకులు అఖిల పక్ష - సమాలోచన సమావేశాన్ని మండలంలోని నంచర్లలో నిర్వహించి చర్చించారు. గండీడ్ కోస్గి నియోజకవర్గం, మహమ్మదాబాద్ మండలం మహబూబ్గనర్ నియోజకవర్గంలో కాకుండా రెండు మండలాలను వికారాబాద్ జిల్లాలో విలీనం చేస్తేనే లాభాలు ఉంటాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీ రాములు, శ్రీనివాస్, లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఆశన్న, కిష్టయ్య, బోయిని గోపాల్, రుద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకటయ్య, గఫార్, విజయ్ కుమార్‌రెడ్డి, దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర కార్మికులను ఆదుకోవాలి


జడ్చర్లలో అడ్డా కూలీల జీవనస్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయేతర కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నేతాజీచౌరస్తా ప్రాంగణంలో అడ్డా కూలీల జీవన స్థితిగతులపై వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాలలో వ్యవసాయ రంగంలో యంత్రాలు రావడంతో చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని, వ్యవసాయేతర పనుల కోసం జడ్చర్లకు వస్తున్నారన్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, గద్వాల, నారాయణపేట, మహమ్మదాబాద్, గండీడ్, కోయిలకొండ, మహబూబ్‌నగర్, కల్వకుర్తి ప్రాంతాల నుంచి జడ్చర్లకు కూలీ పనులకోసం వస్తున్నారని సర్వేలో తమ దృష్టికి వచ్చిందని వివరించారు. కార్మికుల సమస్యలను గుర్తించి వారికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యాదయ్య, ప్రేమలత, కాట్రావత్ శారద, యాదగిరి, వెంకటయ్య, సంపంగి, చంద్రమ్మ, శ్రీనివాస్, జంబ్లీ, చంద్రకళ, మల్లేష్, రాజు, శ్రీశైలం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ


జాతీయ పతాకం రంగుల పూలతో అమ్మవారి అలంకరణ

జడ్చర్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల పూలతో జాతీయ పతాకం ప్రతిబింబిచేలా అలంకరించారు.

వాసవీమాత ఆలయంలో వరలక్ష్మి పూజలు

దేవరకద్ర, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో శ్రావణమాసం నాల్గవ శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరణ చేశారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

మూసాపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలమద్ది గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి జాగృతి గ్రామ మహిళ సంఘం వారు రూ.40 వేల నగదు శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కొంతం జలేందర్‌రెడ్డి, కోట్ల రవికుమార్, చంద్రయ్యగౌడ్, దాసరి వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బడబాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై బాధ్యత పెరిగింది

» ఎస్ఈ వెంకటరమేష్


ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బందితో ఎస్ఈ వెంకట రమేష్

పాలమూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ పలువురు విద్యుత్ సిబ్బంది శుక్రవారం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారిని ఎస్ఈ పి.వెంకటరమేష్ అభినందించారు. వర్షాకాలంలో నాణ్యమైన సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందిని ప్రశంసాపత్రాలతో ప్రభుత్వం సన్మానించిందని తెలిపారు. ప్రశంసలు ఉద్యోగుల్లో బాధ్యత పెంచిందన్నారు. డీఈలు లక్ష్మణ్, చంద్రమౌళి, ఏడీఈలు తౌర్యానాయక్, మద్దిలేటి, సంతోష్, చంద్రశేఖర్, యం.నవీణ్, ఏఈలు అరుణ్‌నాయక్, వి.ఆదిత్య, హరినాథచారి, భీష్మాచారి, నారాయణ పాల్గొన్నారు.

టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నిక

పాలమూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సిద్ధేశ్వర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎండీ అబూబకర్, కోశాధికారిగా రాజు, పట్టణ అధ్యక్షుడిగా మురళీమోహన్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా రాజు రెడ్డి, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

కోయిలకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కావలి వెంకట్రాములు స్కూల్ బ్యాగ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు.

టాపర్లకు నగదు అందజేత

హన్వాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్వాతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో పదో తరగతిలో మండల టాపర్లుగా వచ్చిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదును తహసీల్దార్ కిష్టానాయక్ అందించారు. గొండ్యాల పాఠశాలలో విద్యార్థులకు మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్ పేట్లను అందించారు. నాయినోనిపల్లి హెచ్ఎం పద్మజా విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ అందించారు. హన్వాడ ఉన్నత పాఠశాలలో పదిలో టాపర్లకు నగదు హెచ్ఎం భాస్కర్‌రెడ్డి అందించారు.

పూర్వ విద్యార్థుల విరాళం


మెటీరియల్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ పాఠశాలకు 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.3లక్షలతో గ్రిల్ ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. సాయం అందించిన పూర్వ విద్యార్థులను హెచ్ఎం అబ్దుల్ బాసిత్, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రకాష్, కలకొండ రమేష్, నూకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.